పాఠశాలల్లో 'విజిలెన్స్' తనిఖీలు

చిలమత్తూరు : ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు పాఠశాలల్లో విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. జిల్లా విజలెన్స్ అధికారులు యోగేష్ బాబు, ఫణీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో చిలమత్తూరు మండలంలోని కొడికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తనిఖీ చేశారు. జగనన్న గోరుముద్దలో భాగంగా అందజేస్తున్న కోడిగుడ్లు, చిక్కీలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి, రికార్డులను పరిశీలన చేశారు. కాగ తనిఖీల విషయం పాత్రికేయులకు తెలియకుండా గోప్యంగా ఉంచారు. తనిఖీల సమయంలో విలేకరులను పిలవకుండా, తరువాత విజిలెన్స్ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారంటూ మండల విద్యాశాఖ అధికారులు పత్రిక ప్రకటన విడుదల చేయడంపై పలు అనుమనాలు వ్యక్తం అవుతన్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఇఒ నాగరాజు నాయక్, ప్రధానోపాధ్యాయులు పద్మావతమ్మ ఉన్నారు. ఇక అనంతపురం జిల్లా పరిధిలోని అనంతపురం రూరల్ మండలం పాంపంపేట జెడ్పీ పాఠశాలలోనూ తనిఖీలు చేశారు. ఇక్కడ గుడ్ల పరిణామం తక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం.

గుత్తి రైల్వే బైపాస్ లైన్ ప్రారంభం

- ◆ రూ.43 కోట్లతో 3.02 కిలో మీటర్ల కొత్త లైన్
- ◆ పలు ప్రాంతాలకు రాకపోకలు సులభతరం
- ◆ ప్రయాణికులకు సమయం ఆదా

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో కీలకమైన గుత్తి రైల్వే జంక్షన్‌లో కొత్తగా ఏర్పాటైన బైపాస్ లైన్‌ను శుక్రవారం నుంచి ప్రారంభించారు. దీని ద్వారా గుత్తిలో ఇప్పటి వరకు రైళ్ల రివర్స్ సమస్యకు పరిష్కారం లభించినట్టయింది. ఇంజన్ మార్పు సమయం ఆదా అవడం ద్వారా రాకపోకల్లో కొంత సమయం ఆదా అయ్యే వీలు కలుగుతుంది. 3.2 కిలోమీటర్ల మేర రూపొందించిన బైపాస్ లైన్ రూ.43 కోట్ల విలువతో చేపట్టారు. ఈ రైల్వేలైన్ నిర్మాణంతో గుత్తి -ధర్మవరం, గుత్తి-రేణిగుంట లైన్ల మధ్య రాకపోకలు ఇక సులభతరం కానున్నాయి. ఈ జంక్షన్ నుంచి బెంగళూరు, రేణిగుంట, డోన్, గుంతకల్లు, వాడి వైపు ప్రయాణికుల రైళ్లతోపాటు సరుకు రవాణా రైళ్లు ప్రయాణిస్తూ ఉంటాయి. దక్షిణం వైపు ధర్మవరం, రేణిగుంట వైపు వెళ్లే రైళ్లు ఖచ్చితంగా ఆపి రివర్సల్ చేసుకుని వెళ్లాల్సి వచ్చేది. ఇందుకు చాలా సమయం పట్టేది. ఇప్పుడు ఈ బైపాస్ నిర్మాణం వల్ల సమయంఆదా అవనుంది. ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థతో గుత్తి దక్షిణం వద్ద క్యాబిన్, గుత్తి జంక్షన్ వద్ద మరో క్యాబిన్ ఉన్నాయి. నూతనంగా నిర్మించిన బైపాస్ లైన్ జంక్షన్ క్యాబిన్ దగ్గర మొదలవుతుంది. గుత్తి జంక్షన్ క్యాబిన్ ఇప్పుడు గుత్తి జంక్షన్ బైపాస్ క్యాబిన్‌గా వ్యవహరించబడుతుంది. దీనికి అనుగుణంగా క్యాబిన్‌ను రూపొందించి ఇప్పటికే ఉన్న మార్గ్‌ను అనుసంధానం చేశారు. బైపాస్ లైన్ గుత్తి పట్టణ పక్కనే ఉన్నందున రైలు ప్రయాణికుల రాకపోకలకూ సులభతరం చేయడానికి హైలెవల్ హాల్ట్ ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేశారు.

గుత్తిలో నూతన బైపాస్ రైల్వే ట్రాక్

కొత్త బైపాస్‌లైన్ ప్రారంభంతో ప్రయోజనాలు

- ◆ధర్మవరం వైపు నుంచి రేణిగుంట వైపు వెళ్లే రైళ్లకు అంతరాయం లేకుండా నిరంతరాయంగా రాకపోకలు సాగించవచ్చు.
- ◆సరుకు రవాణా వెళ్లే రైళ్లు నేరుగా వెళ్లేందుకు వీలు కలుగుతుంది. తద్వారా ప్రయాణికులతో వెళ్లే రైళ్లకు ఆటంకాలుండవు. సెక్షన్ సామార్థ్యాన్ని పెంచేందుకు వీలు పడుతుంది.
- ◆రైళ్ల సగటు వేగం పెంచేందుకూ ఉపయోగపడుతుంది.
- ◆రవాణా వ్యవస్థ వృద్ధితో పాటు రోలింగ్ స్టాక్(కోచ్‌లు, వ్యాగన్)ల వినియోగాన్ని మెరుగు పరుస్తుంది.

సకాలంలో పూర్తి చేసిన సిబ్బందికి జిఎం అభినందన

ముఖ్యమైన బైపాస్ లైన్‌కు అవసరమైన మార్పులతో సకాలంలో పూర్తి చేసిన సిబ్బందిని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అభినందినట్టు దక్షిణ మధ్య రైల్వే పిఆర్ఒ రాకేశ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బైపాస్ నిర్మాణం పూర్తి చేయడం వలన కడప, నెల్లూరు జిల్లాల్లో ఉన్న థర్మల్ పవర్‌ప్లాంట్, కృష్ణపట్నం ఓడరేవు, సిమెంటు పరిశ్రమలకు సరుకు రవాణాను సులభతరం చేయనున్నట్టు జనరల్ మేనేజర్ తెలిపారు. ఈ పనులను సకాలంలో పూర్తి చేయడంలో కృషిచేసిన ఇంజినీర్లు, కాంట్రాక్టర్‌ను అభినందించారు.

ఉపాధి, భూమి కోసం పోరాటం

- ◆ కూలీలను ఆదుకునే చర్యలు చేపట్టాలి
- ◆ వ్యకాసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు
- ◆ పెనుకొండలో 2వ జిల్లా మహాసభలు

పెనుకొండలో ర్యాలీ చేస్తున్న వ్యకాసం నాయకులు

మహాసభలో ప్రసంగిస్తున్న వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి -పెనుకొండ

వ్యవసాయ కూలీలుకు ఉపాధి పనులు కల్పించడంతో పాటు, భూమిలేని ప్రతి పేద కుటుంబానికి భూమి ఇచ్చేంత వరకు పోరాటాలు సాగించాల్సిన అవసరం ఉందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం నాడు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా రెండవ మహాసభలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రైతుసంఘం, ఐద్వా జిల్లా నాయకులు ఎం.ఇంతియాజ్, వెంకటేష్, హరి, గౌతమి పాల్గొన్నారు. ముందుగా పట్టణ పురవీధులలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మార్కెట్‌యార్డు మహాసభ ప్రాంగణం వద్ద సంఘం నాయకురాలు వెంకటలక్ష్మి జెండాను ఆవిష్కరించారు. వ్యకాసం జిల్లా కార్యదర్శి పెద్దన్న అధ్యక్షత నిర్వహించిన మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేదలందరికీ భూమి పంచడం ద్వారా వారికి ఉపాధి లభిస్తుందన్నారు. చాలా మంది పేదలు ఇప్పటికే ప్రభుత్వ భూముల్లో సాగు చేసుకుంటున్నారని, వారందరికీ వెంటనే సాగుపట్టాలు ఇవ్వాలన్నారు. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సుల మేరకు ప్రతి కుటుంబానికీ రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం అమలు చేసి తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ కూలీలను వలసలు నుంచి ఆదుకుంటున్న ఉపాధి పని దినాలు 200 రోజులకు పెంచి, కూలి రూ.600 ఇవ్వాలన్నారు. 'ఉపాధి'లో కోతపెట్టే చర్యలను బిజెపి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉపాధి, వ్యవసాయ కూలీలను ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరారు. కూలీల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం నాయకులు ప్రవీణ్‌తో పాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

సమస్యను చెప్పినందుకు ఆక్రోశం..!

- ◆ ఎమ్మెల్యే 'దుద్దుకుంట' ఇంటి వద్ద ఉద్రిక్తత
- ◆ మసకవంకపల్లి యువకులపై ఎమ్మెల్యే అనుచరుల దాడి
- ◆ సాయంత్రం వరకు పోలీసుస్టేషన్‌లోనే యువకులు
- ◆ స్టేషన్ వద్ద ప్రతిపక్షాల నిరసన

పుట్టపర్తి పోలీసు స్టేషన్‌లో ఉన్న మసకవంకపల్లి యువకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సచివాలయం మార్పునకు సంబంధించిన సమస్య చాలాకాలంగా అపరిష్కృతంగా ఉండడంతో దానిని పరిష్కరించాలని ఎమ్మెల్యే ఇంటి వద్దకెళ్లిన గ్రామస్తులపై ఆయన మద్దతుదారులు ఆక్రోశం వెల్లగక్కారు. సమస్యను పరిష్కరించకపోగా వారిపై దాడికి పాల్పడ్డారు. శుక్రవారం నాడు పుట్టపర్తిలో చోటు చేసుకున్న ఈ ఘటనపై ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. ఇందుకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాల మేరకు... పుట్టపర్తి నియోజకవర్గం నల్లమాడ మండల పరిధిలోని మసకవంకపల్లి గ్రామానికి చెందిన 20 మంది యువకులు శుక్రవారం నాడు పుట్టపర్తిలోని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నివాసం వద్దకెళ్లారు. తమ గ్రామానికి మంజూరైన సచివాలయాన్ని గోపేపల్లిలో ఏర్పాటు చేశారని, అక్కడికి వెళ్లాలంటే 9 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉందన్నారు. ఏ చిన్నపనికి వెళ్లాలన్నా రానుపోను 18 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉందన్నారు. దీనిని కురుమాల సచివాలయంకు మారిస్తే తమకు ఇబ్బందులు తొలగుతాయని, లేదా తమ గ్రామంలోనే సచివాలయం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డిని కోరారు. ఈ సమస్యను వివరిస్తున్న క్రమంలో గ్రామస్తులు, ఎమ్మెల్యే వర్గీయుల మధ్య వాదోపవాదాలు మొదలయ్యాయి. ఇలా మాట్లాడుతున్న క్రమంలో ఒక్కసారిగా ఎమ్మెల్యే వర్గీయులు గ్రామానికి చెందిన యువకులపై దాడి చేసినట్లు బాధితులు తెలిపారు. అక్కడితో ఆగకుండా యువకులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని సమస్యను తెలిపేందుకు వచ్చిన మసకవంకపల్లి యువకులను పుట్టపర్తి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వారిని పోలీసు స్టేషన్‌లోనే ఉంచారు. వీరిలో కొందరు అయ్యప్పమాలధారులు కూడా ఉన్నారు. సాయంత్రం స్నానం చేసేందుకు కూడా వారిని బయటకు పంపలేదు. ఈ విషయంపై పుట్టపర్తి అర్బన్ సిఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి మాట్లాడుతూ మసకవంకపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని దూషించారని, ఆయన కార్యాలయ సిబ్బంది ఫిర్యాదు మేరకు యువకులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

జనసేన, సిపిఐ నిరసన

యువకులపై దాడి, పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలుసుకున్న సిపిఐ, జనసేన నాయకులు అర్బన్ పోలీస్ స్టేషన్ వద్ద శుక్రవారం సాయంత్రం నిరసన తెలిపారు. సిపిఐ జిల్లా నాయకులు అంజి, చలపతి, జనసేన నాయకులు అబ్దుల్, ఆది, తిరుపతేంద్ర ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యను పరిష్కరించమని కోరడానికి వచ్చిన యువకులపై ఎమ్మెల్యే అనుచరులు దాడి చేయడం దుర్మార్గం అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలపై ప్రశ్నించే హక్కు ప్రజలకు లేదా అని నిలదీశారు. పోలీసు స్టేషన్‌లో ఉన్న యువకులను వెంటనే విడుదల చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. స్టేషన్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు బలవంతంగా అడ్డుకుని వారిని రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

సాయంత్రం యువకుల విడుదల

ఎమ్మెల్యే సిబ్బంది ఫిర్యాదు మేరకు అదుపులోకి తీసుకున్న 17 మంది యువకులను పోలీసులు సాయంత్రం విడుదల చేశారు. మసకవంకపల్లి సర్పంచి రామ్మోహన్ రెడ్డితో పాటు గ్రామస్తులు పుట్టపర్తికి వచ్చి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డితో మాట్లాడారు. యువకులు గ్రామంలో ఎవరికీ తెలియకుండా సమస్యను తెలియజేయడానికి వచ్చారని, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు రాకుండా చూసుకుంటామని గ్రామనాయకులు తెలియజేశారు. అదే విధంగా సచివాలయ సమస్య తీర్చాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి సచివాలయం కోసం గోపేపల్లికి వెళ్లకుండా దగ్గరలో ఉన్న కురమాలకు కొద్ది రోజులు మ్యాపింగ్ చేపిస్తామని, అనంతరం మసకవంకపల్లి గ్రామంలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లీనిక్‌ల నిర్మాణ పనులకు గ్రామంలో త్వరలో భూమిపూజ చేస్తామని తెలియజేశారు. యువకులపై ఎలాంటి కేసు నమోదు చేయకుండా విడుదల చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

ప్రజలకు ముఖం చూపించలేకపోతున్నాం : సర్పంచులు

అధికారులతో మాట్లాడుతున్న సర్పంచులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

తమ గ్రామ పంచాయతీలలో ప్రజలకు తమ ముఖాలను చూపించలేకపోతున్నామని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికమండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి గంగమ్మ వెంకటరత్నం అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచులు తమ సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. 14 ,15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు జమ కాకపోగా వచ్చిన అరకొర నిధులను కూడా అధికారులు విద్యుత్ బకాయిలకు, క్లాప్ మిత్ర వేతనాలకు జమ చేయడం అన్యాయమన్నారు. దీంతో పంచాయతీలలో వీధి బల్బులు, మోటార్ రిపేర్లు తదితర సమస్యలు తీర్చలేక పోతున్నామని వాపోయారు. దీంతో పంచాయతీ ప్రజలకు తమ ముఖం చూపులేకపోతున్నామన్నారు. గత మూడు సమావేశలలో చర్చించిన ప్రజా సమస్యలు అధికారులు పరిష్కారం చేయలేదని పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, పథకాలు సర్పంచులైన తమకే తెలియటం లేదని ఇంక గ్రామాల్లోని ప్రజలకు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. ఈ సమావేశాలకు టీ, కాఫీ, బిస్కెట్ తినటానికి వస్తున్నామా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సర్పంచులు పోడియం ముట్టడించి నిరసన తెలిపారు. అనంతరం సమావేశాన్ని బాయ్‌కాట్ చేసి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, తహశీల్దార్ మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ రత్నమ్మ నారాయణ, ఎంపీటీసీలు పూజారి ఈశ్వరయ్య, నాగప్ప, నందిని, రాజేశ్వరి, సర్పంచులు గంగాదేవి, కిష్టప్ప, సోమశేఖర్, పరంధామ, రామాంజనేయులు, అంజి నాయక్, గిరిజమ్మ, నిర్మలమ్మతో పాటు సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ రంగం కార్మికులను ఆదుకోండి

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - నల్లచెరువు

భవన నిర్మాణరంగ కార్మికులను ఆదుకోవాలని భవన నిర్మాణరంగ కార్మికసంఘం జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ భారతికి సమర్పించారు. ఈసంరద్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో రాష్ట్రంలో ఇసుక దొరకడం గగనమైపోయిందన్నారు. ఇసుక కొరతతో పనులు లేక భవన నిర్మాణ రంగ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఎలాంటి సాయం అందించలేదని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికుల పట్ల తీవ్ర నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందన్నారు. సంక్షేమ నిధులను అడ్డదారిలో వివిధ పథకాలకు మళ్లించి కార్మికుల జీవితాలను మరింత కష్టాల పాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ రంగ కార్మికులు సదాశివ, సూరి, మురాషా, తిరుపాల్ నాయక్, శ్రీరాములు, అంజి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

అమరాపురం : మండల పరిధిలోని మద్దనకుంటలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా గ్రామస్తులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గోవిందప్ప, ఎంపిపి ఈరన్న, సింగిల్‌విండో అధ్యక్షులు బాగాల చిక్కన్న, జెడ్పీటీసీ స్వరక్క నరసింహమూర్తి, వైస్ ఎంపిపి కృష్ణమూర్తితో పాటు నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గోరంట్ల : అర్హులకు సంక్షేమ పథకాలు అందివ్వడమే ప్రభుత్వ లక్ష్యమని పెనుగొండ శాసనసభ్యులు శంకర్ నారాయణ అన్నారు. మండలంలోని చింతమాను పల్లి, కాంగారెడ్డిపల్లిలో శుక్రవారం నిర్వహించిన గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర్‌నారాయణ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు ఈ కార్యక్రమంలో కన్వీనర్ లక్ష్మీ నరసప్ప, సర్పంచి అనిత వెంకటరమణ, ఎంపీటీసీ జయచంద్రారెడ్డి, ఎంపీపీ ప్రమీలతో పాటు వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు

కదిరి టౌన్ : గ్రామ, వార్డు వాలెంటరీ వ్యవస్థ ద్వారా ప్రజలు ఇంటి ముందుకే సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. కదిరి రూరల్ మండలం, ముత్యాలచెరువు గ్రామ పరిధిలోని ముత్యాలచెరువు, కట్టెలతండా, అల్లిపూర్ తండా గ్రామాల్లో సర్పంచి విశ్వనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమర్నాథ్ రెడ్డి, కౌన్సిలర్ కృపాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంద్ నాయక్, నాయకులు నరసింహులు నాయక్, విశ్వనాథ్ రెడ్డి, కిరణ్ కుమార్, ప్రభాకర, బాలవర్ధన్ రెడ్డి, ప్రకాష్, పరికి సాదిక్, రమేష్ రెడ్డితో పాటు అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

ఎయిడ్స్‌నివారణపై అవగాహన ర్యాలీ

నల్లమాడ : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా నల్లమాడలో గురువారం రెడ్డిపల్లి పిహెచ్‌సి సిబ్బంది, విద్యార్థులు ఎయిడ్స్‌నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో మానవహారంగా ఏర్పాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ రామాంజులు, వైద్య సిబ్బంది మంజుల, అక్బర్, ప్రమీలమ్మ, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై తహశీల్దార్‌కు ఫిర్యాదు

కొత్తచెరువు : మండల పరిధిలోని నారేపల్లి పంచాయతీలోని కడప నాగేపల్లి గ్రామంలోని కొత్తపల్లి పొలంలో 111 సర్వే నంబర్‌లో గల కాకానల్ల గుట్ట ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఆ గ్రామానికి చెందిన రైతులు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన రైతులు చౌడమ్మ, రంగనాయకులు, కుల్లాయప్ప, సుబ్బమ్మ, మునెప్ప, మంగమ్మ తదితరులు తహశీల్దార్ రామాంజనేయ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు చెందిన రైతులు అనే సంవత్సరాలుగా గుట్ట పక్కనే ఉన్న భూములను సాగు చేసుకుంటున్నామని అయితే మరో వ్యక్తి వచ్చి ఆ గుట్టను ఆక్రమించుకొని జెసిబితో చదును చేయించాడని విమర్శించారు. ప్రశ్నించిన తమపై దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఈ వ్యక్తి శ్మశాన వాటికను సైతం దున్ని పంట సాగు చేశాడన్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గుంటప్ప, లక్ష్మీదేవి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు దరఖాస్తుల ఆహ్వానం

రొద్దం : 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరు సాధారణ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని తహశీల్దార్ అనంతాచారి కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా కారణాలతో ఇంకా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాటలంటే ఫారం–6 దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 8వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బుక్కపట్నం : 18 సంవత్సరాలు నిండిన యువతి ,యువకులకు ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ నటరాజ్ కోరారు. ఓటు నమోదుకు ఫామ్ 16 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గ్రాడ్యుయేట్ పూర్తయిన వారు ఓటరుగా పేరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బత్తలపల్లి : ఓటరు నమోదుపై శని, ఆదివారాలలో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ యుగేశ్వరీదేవి అన్నారు. అర్హులైన వారు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

గాండ్లపెంట : మండలంలోని 14 గ్రామ పంచాయతీలోని 2020–21, 2021–22 సంవత్సరాలకు సంబందించి జరిగిన ఉపాధి పనుల సామాజిక తనిఖీపై ప్రజావేదికను స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఆవరణంలో శుక్రవారం నిర్వహించారు. పది రోజుల నుంచి అధికారులు నిర్వహించిన సామాజిక తనిఖీలో తెలుసుకున్న అంశాలను ఈసందర్భంగా చదివి వినిపించారు. తమ తనిఖీలో బయట పడ్డ అవినీతికి సంబందించిన మొత్తాన్ని రికవరీ చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ రామాంజనేయులు, విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఎస్ఆర్‌పి మల్లికార్జున, ఎంపీపీ జగన్మోహన్, వైసిపి మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డితో నాయకులు, అధికారులు, ఉపాధి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళా భద్రతకు ప్రత్యేక చట్టాలు

పుట్టపర్తి రూరల్ : మహిళలపై అఘాయిత్యాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని వాటిని నివారించడానికి ఉన్న చట్టాలతో పాటు ప్రత్యేక చట్టాలు తేవాలని డివి సెల్ కౌన్సిల్ ఉమాదేవి పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తి లోని శ్రీ శక్తి భవనంలో శ్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. 2013 లో ఏర్పాటు చేసిన చట్టం ప్రకారం మహిళలు సహ ఉద్యోగుల ద్వారా లైంగిక వేధింపులకు గురి అయితే వాటిని ఎలా నివారించుకోవాలి ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ నోడల్ ఆఫీసర్ గాయిత్రి, సఖి సెంటర్ మేనేజర్ శాంతమణి, ఐసిడిఎస్ పుట్టపర్తి సూపర్వైజర్ సుజాత, గ్రామ, వార్డు సచివాలయాల కోఆర్డినేటర్లు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, వివిధ శాఖల మహిళ సిబ్బంది పాల్గొన్నారు.

హైకోర్టు స్టే కొనసాగింపు

అమరాపురం : మండల కేంద్రంలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగింపు విషయంపై హైకోర్టు గతంలో ఇచ్చిన స్టేను కొనసాగించినట్లు స్థానిక కిరణ్ టెక్స్‌టైల్స్ నిర్వాహకులు తెలిపారు. కట్టడాలు తొలస్తామని సంబంధిత గ్రామ కార్యదర్శి గతంలో నోటీసులు అందజేయడంతో కోర్టుకు వెళ్లగా స్టే విధించిందన్నారు. ఈ స్టేను ప్రస్తుతం కొనసాగించిందని ఆయన చెప్పారు.

చట్టాలపై అవగాహన అవసరం

కదిరి టౌన్ : చట్టాలపై అవగాహన అవసరమని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవ వారోత్సవాలలో సందర్భంగా స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా భారత రాజ్యాంగం గురించి వ్యాసరచన పోటీలు నిర్వహించగా అందులో ప్రతిభ కనపర్చిన ముగ్గురు విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి మరి ఎస్ ప్రతిమ , న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లోకేశ్వర్ రెడ్డి , సీనియర్ న్యాయవాది నరసింహులు, హాస్టల్ వార్డెన్ ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

ప్రతి ఇంటికీ గ్యాస్ కనెక్షన్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా ప్రతి ఇంటింటికి గ్యాస్ కనెక్షన్ అందించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎజి అండ్ పి ప్రథమ్ సంస్థ రీజన్ డైరెక్టర్ వెంకటేష్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు మార్కెటింగ్ హెడ్ శేఖర్ మాట్లాడుతు జిల్లాలో ఎజి అండ్ పి ప్రథమ్ సంస్థ రూ.220 కోట్ల పెట్టుబడితో 2028 నాటికి 500 మందికి ఉపాది అవకాశాలు కల్పించాలన్న సంకల్పంతో ముందుకు వచ్చిందన్నారు. సహజ వాయువుతో సిద్ధం చేసిన గ్యాస్‌ను తక్కువ ధరకు ప్రజలకు అందించేందుకు అన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. హిందూపురం పట్టణంలో 12353 గ్యాస్ కనెక్షన్‌లు అందించేందుకు ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. ఇందులో బాగంగా ఇప్పటికే 2644 కనెక్షన్‌లు అందించామన్నారు. కర్నాటక రాష్ట్రం శిరా నుంచి ప్రత్యేక పైప్ లైన్ ద్వారా హిందూపురం పట్టణ వ్యాప్తంగా గ్యాస్‌ను అందిస్తామన్నారు. జిల్లాలో హిందూపురంతో పాటు ధర్మవరం, కదిరి పట్టణాల్లో తొలుత ప్రారంభించి, మిగిలిన పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సైతం విస్తరింపజేస్తామన్నారు.

జర్మన్ టెక్నాలజీతో రోడ్డు నిర్మాణ పనులు

బత్తలపల్లి : మండలంలోని డి. చెర్లోపల్లి పంచాయతీ పరిధిలో జర్మన్ టెక్నాలజీతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను సింగిల్ విండో అధ్యక్షులు చల్లా శ్రీరాములు, వైసిపి నాయకులు చల్లా కృష్ణమనాయుడు శుక్రవారం ప్రారంభించారు. కట్టకిందపల్లి స్టేజి నుంచి డి. చెర్లోపల్లి, పత్యాపురం, పత్యాపురం తండా వరకు ఐదున్నర కిలోమీటర్లు జర్మన్ టెక్నాలజీతో రోడ్డు పనులు చేసేందుకు ఏషియన్ ఇండ్రస్ట్రియల్ ఇన్ఫ్రాస్టక్చర్ బ్యాంకు నిధులు రూ.2.20కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ పనుల వల్ల రోడ్డు ఎక్కువ కాలం ఉండడంతో పాటు పనులు వేగవంతంగా జరుగుతాయన్నారు. వాతావరణ కాలుష్యం. తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ రామ్మోహన్, ఈఈ శ్రీనివాసులుతో పాటు పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

వైసీపీ పాలనతో రాష్ట్రం రావణకాష్టం : చిలకం

ధర్మవరం టౌన్ : వైసీపీ పాలనలో రాష్ట్రం రావణకాష్టంలా మారిందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలోని 6వ వార్డు కేశవనగర్లో నిర్వహించిన సేవ్ ధర్మవరం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కాలనీవాసులతో మాట్లాడారు. చంద్రబాబునగర్లో ప్రజలు, చేనేతలు వారి సమస్యలను మధుసూదన్‌రెడ్డికి విన్నవించారు. అనంతరం చిలకం మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రజాసమస్యలను గాలికి వదిలేసిందన్నారు. కేశవనగర్లో ఇంతవరకు సీసీరోడ్లు, డ్రైనేజీలు వేసిన పాపానపోలేదన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

యువకుడితో మాట్లాడుతున్న 'చిలకం'

పేదలకో న్యాయం...పెద్దలకో న్యాయమా..? : సిఐటియు

ఆందోళన కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో ఒకట స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిఐ పేదలకో న్యాయం..పెద్దలకో న్యాయం చేస్తున్నారని, ఆయనపై విచారణ జరిపి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహ్మప్ప డిమాండ్ చేశారు. సిఐ తీరుకు నిరసనగా సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు కార్మికులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సిఐకు వ్యతిరేకంగా నినాదాలు చేసి, రెవిన్యూ అధికారికి వినతిని ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 14రోజుల క్రితం ఆగి ఉన్నా ఆటోకు ఆర్‌టిసి అద్దె బస్సు డీకొన్న ప్రమాదంలో గాయపడిన కార్మికులను జిల్లా ప్రభుత్వ అసుపత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించామన్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేయాలని సిఐను కోరామన్నారు. అయితే ఆయన బస్సు ఓనర్‌తో చర్చించి బస్సును వదిలి 14 రోజుల నుంచి కేసు నమోదు చేయకుండా ఆటోను బయటకు పంపకుండా నియంతలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఉపాధి కోల్పోయిన ఆటోను నమ్ముకుని జీవనం చేస్తున్న ఆటో కార్మికుడు శనివారమప్ప కుటుంబ జీవనం కష్టంగా మారిందన్నారు. ప్రతి రోజు ఆటో కార్మికుడు స్టేషన్‌కు వెళుతున్న సిఐ అతనికి న్యాయం చేయక పోగా ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సిఐ పెద్దలకో న్యాయం, పేదలకో న్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఐ వ్యవహార శైలిపై అధికారులు విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఆటో కార్మికుడికి 14 రోజుల నష్ట పరిహారాన్ని ఇవ్వాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు జగదీష్, నాయకులు రామకృష్ణ, అత్తార్‌బాబా, జబివుల్లా, బాబురెడ్డి, రీయాజ్, మల్లికార్జున, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుట్ ఐటికి ఊటకూరు విద్యార్థి

పరిగి : మండలంలోని ఊటకూరు పంచాయతీకి చెందిన విద్యార్థిని జాహ్నవి ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణానాయక్ తెలిపారు. 2021- 22 సంవత్సరం 10వ తరగతిలో 551 మార్కులతో మండల టాపర్ గా నిలిచిన జాహ్ణవి శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటికి ఎంపికయిందన్నారు.

డిప్యూటీ తహశీల్దార్‌గా మైనుద్దీన్

హిందూపురం : హిందూపురం మండల ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్‌గా మైనూద్దీన్ శుక్రవారం భాధ్యతలు స్వీకరించారు. ఇతను పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇదివరకు పనిచేసేవారు. బదిలీలో భాగంగా హిందూపురం ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్‌గా వచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

రాష్ట్రంలో అరాచక పాలన : టిడిపి

కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కందికుంట

కదిరి టౌన్ : రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపుదామని కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని కుట్టాగుళ్లలో నిర్వహించిన ఇదేం కర్మ రాష్ట్రానికి అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కందికుంట ప్రతి ఇంటికి తిరుగుతూ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రజలపై అన్ని విధాల పన్నులు వేస్తూ నిలువు దోపిడీ చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే ప్రతిపక్ష పార్టీలపై, ప్రజలపై అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి కౌన్సిలర్ గంగాభవాని, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : రాష్ట్రవ్యాప్తంగా టిడిపి చేపట్టిన ఇదేం ఖర్మ అనే కార్యక్రమాన్ని మండల పరిధిలోని గుంతపల్లిలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. వైసిపి పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుఆన్నరన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు పర్వీన్ భాను, నాయకులు నాగేంద్ర కుమార్, ముబారక్, రాజారెడ్డి, ఓబుల్ రెడ్డి, గోపాల్, నారాయణరెడ్డి, అలీపీరా, జయచంద్రతో పాటు అధికసంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

గోరంట్ల : మండలంలోని మల సముద్రం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే పార్థసారథి ఆధ్వర్యంలో ఇదేమి ఖర్మ కార్యక్రమాన్నిశుక్రవారం నిర్వహించారు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేకు ఆ గ్రామ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రజలు పడుతున్న కష్టాలను వివరించారు. అరాచక పాలనకు చరమగీతం పాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశ్వర్థరెడ్డి, సోమశేఖర్, వేణు రాయల్, నీలకంఠారెడ్డి, నరేంద్ర రాయల్, అజమతుల్లా, గిరి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : ఆంధ్రప్రదేశ్లో వైసీపీ అధికారంలోకి రావడం మన ఖర్మ అని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఇదే ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని పట్టణంలోని 5,6.7 వార్డులలో టీడీపీ నాయకులు నిర్వహించారు. ఇందులో భాగంగా నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజాప్రతిరేక విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమతం కాటమయ్య, చింతలపల్లి మహేశ్ చౌదరి, బోయరవిచంద్ర, పరిశేసుధాకర్, పురుషోత్తంగౌడ్, చింతపులుసు పెద్దన, భీమనేని ప్రసాదానాయుడు గరుగు వెంగప్ప,తో పాటు అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, చైర్‌పర్సన్, తదితరులు

అభివృద్ధి చేసి చూపిస్తాం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘ అభివృద్ధినిగత పాలకులు కేవలం అంకెల్లో చూపించారని అయితే తమ ప్రభుత్వం చేసి చూపిస్తుందని ఎమ్మెల్సీ ఇక్బాల్ పేర్కొన్నారు. శుక్రవారం హిందూపురం పురపాలక సంఘ పరిదిలోని 35వ వార్డులో రూ.29లక్షలతో చేపట్టిన సిసి రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజతో కలిసి ప్రారంభించారు. అనంతరం వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్లు జబీవుల్లా, బలరామిరెడ్డి, వార్డు కౌన్సిలర్ మద్దెన జయరాములు, కౌన్సిలర్లు మారుతీరెడ్డి, అయూబ్, గిరీష్, మల్లికార్జున, నాగేంద్రమ్మ, కో–ఆప్షన్ సభ్యులు రహమత్, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు

హిందూపురం : పుట్టపర్తిలో శనివారం నుంచి నిర్వహించే భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) జిల్లా నాలుగవ మహా సభను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి కోరారు. శుక్రవారం స్థానిక కళాశాల వసతిగృహ ఆవరణంలో మహాసభలకు సంబందించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఐ బీసీ హాస్టల్ కమిటీ నాయకులు రంగధామప్ప, బాబాఫక్రుద్దీన్, రంగప్ప, గురుశాంత్, నందీష్, నవీన్, జగదీష్, ఏంజేరప్ప, హనుమంతు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

పార్టీబలోపేతానికి కృషి : బికె

పెనుకొండ : పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారథి కోరారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టిడిపి జిల్లా నియోజకవర్గ ఎస్ సి సెల్ కమిటీల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో తెలుగుదేశం పార్టీ ని బలోపేతం చేసేందుకు కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. జగన్ రెడ్డి ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని సూచించారు. అదేవిధంగా టిడిపి చేపట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు మంజునాథ, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఎస్‌సిసెల్ నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

నాయకులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పార్థసారథి

పరీక్ష ఫీజు చెల్లించిన ఉపసర్పంచి

ప్రజాశక్తి - తలుపుల

మండల పరిధిలోని తలుపుల,ఉబ్బరవాండ్లపల్లి, గుండువారిపల్లి, ఓబుళరెడ్డిపల్లి, కుర్లి పాఠశాల పరిధిలోని పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్ష ఫీజును తలుపుల ఉపసర్పంచి డికె బాబు చెల్లించారు. 310 మంది విద్యార్థులకు 44 వేలు నగదును ఆయా పాఠశాలల హెచ్ఎంలకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్ బాబు, విశ్వనాథరెడ్డి, రామచంద్ర, రామచంద్రారెడ్డి, నజమునిషా బేగం, మాజీ సర్పంచి ఫయాజ్, కాలేజ్ కమిటీ చైర్మన్ అంజి, ప్రభువర్ధన్, దివాన్ వలి, మౌలా, రమేష్ ,శ్రీధర్, గంగరాజు, గంగాధర తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఆర్థికసాయం : తలుపుల మేజర్ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు నడి వీధి గంగమ్మ జాతరకు సందర్భంగా ఉపసర్పంచి డికె బాబు ఆర్థికసాయం అందజేశారు. పారిశుధ్య కార్మికులకు రూ. 25 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డిపి ఫయాజ్ అహ్మద్, ప్రభువర్ధన్, మౌలా, రమేష్, శ్రీధర్, గంగరాజు, శ్రీనివాసులు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు నగదు అందజేస్తున్న ఉపసర్పంచి, తదితరులు

పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

రాయలసీమ గర్జనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

వికేంద్రీకరణకు మద్దతుగా నిర్వహించే రాయలసీమ గర్జనను విజయవంతం చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు పుట్టపర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ వికేంద్రీకరణకు మద్దతుగా ఈ నెల 5న కర్నూల్‌లో నిర్వహించే రాయలసీమ గర్జనను జయప్రదం చేయాలని కోరారు. అదే విధంగా ఈ నెల 7న విజయవాడ లోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే జయహోబీసీ మహాసభ ను జయప్రదం చేయాలని కోరారు. ఈసందర్భంగా మహాసభల పోస్టర్లను వారు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, వైసీపీ మండల కన్వీనర్లు నరసారెడ్డి, రంగారెడ్డి, వైసిపి నాయకులు నారాయణరెడ్డి, మాజీ మండల కన్వీనర్ గంగాద్రి, మాధవప్ప, జిల్లా బీసీ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పద్మశాలీయుల శోభాయాత్ర

శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే, తదితరులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పద్మశాలీయుల కలశ శోభాయాత్ర వైభవంగా సాగింది. 2వేల మంది మహిళలు తలపై కలశాలను పెట్టుకుని పట్టణ పురవీధుల్లో శోభాయాత్ర చేశారు. పట్టణంలోని శ్రీ మార్కండేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన, గోపురం కలశ స్థాపన ఉత్సవాల్లో భాగంగా శ్రీ పద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని గాంధీనగర్ మారుతి రాఘవేంద్రస్వామి కల్యాణ మండపం నుంచి శోభాయాత్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని శోభాయాత్ర చేపట్టారు. అనంతరం ఆలయంలో పట్టువస్త్రాలను సమర్పించారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శ్రీ పద్మశాలీయ బహుత్తమ సంఘం అధ్యక్షుడు జక్కా చిన్న శింగరయ్య, ఉపాధ్యక్షుడు జింకా రామంజనేయులు,ప్రధాన కార్యదర్శి జింకా చిన్నప్ప, సహాయ కార్యదర్శి బొడగల శంకర్, కోశాధికారి పొరాళ్ల పుల్లయ్య తదితరులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అనంతరం మహిళలు నిర్వహించిన కోలాటాలు ఆకట్టుకున్నాయి. శనివారం కూడా ప్రత్యేక పూజలు కొనసాగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్పర్సన్ లింగం నిర్మల, అఖిలభారత పద్మశాలియ సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, జాతీయ చేనేత దినోత్సవం రూపకర్త వెంకన్న, మున్సిపల్ కౌన్సిలర్లు, శ్రీ పద్మశాలీయ బహుత్తమ సంఘం నాయకులు జింకా నాగభూషణ, గోలి నాగభూషణ, గడ్డం రామకృష్ణ, జింకా మోహన్ బాబు, కట్టా గోవిందు, పోలంకి పెద్ద రెడ్డప్ప, జింకా రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDL. JUNIOR CIVIL JUDGE :HINDUPUR
O.S.No.128/2021
Between:
N.Mohammed Iliyaz ... **Plaintiff**
AND
Ranganath and others ...**Defendents**
SUMMONS TO DEFENDANT No.4
To
S.B.Ram Murthy S/o Subbaiah, Aged 55 years, Cultivation, Srikantapuram Village, Hindupur Mandal, Sri Satya Sai Dist.
Meadam
Plase take summons that the Plaintiff filed a suit against you No.4 and others for rectification of the sale deeds.You No.4 may attend the court on 30-12-2022 at 10:30 A.M. either in person or through an Advocate.If you No.4failed to do so, the matter will be decided an ex part.
(By order of the court)
K.NAGAPPA
Advocate For Plaintiffs

IN THE COURT OF THE HON'BLE IInd ADDL. JUNIOR CIVIL JUDGE, (MOBILE COURT), ANANTHAPURAMU
O.S.No:1423/2019.
Between:
Style Gents Wear, rep by its prop.
Shaik Baba Vali ... **PLAINTIFF**
AND
B.Sreeramulu Naik ... **DEFENDANT**
NOTICE TO DEFENDANT
TO
B.Sreeramulu Naik S/o Lakshme Naik, Aged 37 years, Hindu, residing at Nakkalavanka Thanda, Reddipalli Post, Nallamada Mandal, Sri Sathya sai District.
పై వాదితో ప్రతివాది అయిన నీవు 21-07-2016 వ తేదిన తీసుకున్న బాకీకి గాను నీపై దావా దాఖలు చేసి ఉన్నారు. పై కోర్టువారు మీ హాజరు నిమిత్తము 30-12-2022 వ తేదిన వాయిదా వేసినారు. కావున ఆ దినమున ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గానీ, లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు కానీ యెడల పై దావా మీ పరోక్షము నందు తీర్మానించబడును అని తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
K.NAGI REDDY,
Advocate, Ananthapuramu
Cell:9440215885

మహారాజశ్రీ అనంతపురం మూడవ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు అనంతపురం.
O.S.NO:922/2022
Between:
1. జి.కృష్ణారెడ్డి
2. జి వెంకటనారాయణ ...వాదులు
ఎదరి
మచ్చా కాంతమ్మ ...ప్రతివాది
ప్రతివాదికి సమన్లు
శ్రీమతి మచ్చా కాంతమ్మ భర్త వీరస్వామి వయసు 70 సంవత్సరాలు సైదాపురం గ్రామము కదిరి మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.
ఇందుమూలంగా ప్రతివాది అయిన నీకు తెలియజేయడమేమనగా పై కోర్టు పై కేసులో మీకు పలుమార్లు సమన్లు పంపిన చేరునందున ఈ ప్రకటన ద్వారా మీకు సమన్లు జారీ చేయమని ఆదేశించి పై కేసు 13-12-2022న తేదీన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసి ఉన్నారు. కావున మీరు సదరు తేదీనాడు ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గానీ, లేక వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షంగా తీర్మానించబడును.
(కోర్టు వారి ఆదేశాల మేరకు)
వాయిదా తేది: 13-12-2022
యం.సురేష్ కుమార్, అడ్వకేట్
14బి 353 కమలానగర్
అనంతపురం-515001
సెల్ నెంబర్:9441168233